
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
బుధవారం 29 అక్టోబరు 2025



## రాజన్న ఆలయాన్ని పరిశీలించిన ఆక్టోపస్ బృందం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయాన్ని మంగళవారం ఆక్టోపస్ బృదం పరిశీలించింది. రాజన్న ఆలయంలో భద్రత ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని 20మందితో కూడిన ఆక్టోపస్ బృందం మంగళవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. రాజన్న ఆలయంతో పాటుగా భీమేశ్వర, నగరేశ్వర, బద్ది పోచమ్మ ఆలయ పరిసరాలను, పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, అల్మాస్‌పూర్ గ్రామాల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి సారియాఅంజుమ్ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 662 మంది విద్యార్థివిద్యార్థులకు పరీక్షలు జరిపి మందులను అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి అంజత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కాశీకి తరలివెళ్లిన రాజన్న ఆలయ బృందం

వేములవాడ కల్చరల్,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు, అర్చకుల బృందం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి తరలివెళ్లారు. లోక కల్యాణార్థం నవంబరు 1న కాశీలో జరిపించే రాజరాజేశ్వర స్వామి కల్యాణం కోసం బయలుదేరినట్లు తెలిపారు. శ్రీరాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణంతో పాటుగా పూర్ణహుతి నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

కాగా, కాశీకి వెళ్లిన వారిలో ఉమేష్ శర్మ, శరత్, చంద్రశేఖర్, మామిడిపల్లి శరత్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రీనివాస్ శర్మ, బాస్కర్, వెంకటయ్యలు ఉన్నారు.

# భూముల సర్వే వేగవంతం

- రైతులకు తొలగనున్న సర్వే ఇబ్బందులు
- పారదర్శకంగా భూ రిజిస్ట్రేషన్లు
- జిల్లాకు 66 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

భూముల సర్వేలు సకాలంలో జరుగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూమి సర్వే కోసం దరఖాస్తు చేసుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం పకడ్బందీగా అమలు చేయడానికి పూనుకుంది. రిజిస్ట్రేషన్ సమయంలోనే భూములను సర్వే చేసి మ్యాప్‌ను రూపొందించి ఇవ్వాలని ప్రభుత్వ నిబంధనలు పెట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తగినంత సిబ్బంది లేకపోవడంతో భూసర్వే, మ్యాపింగ్‌లో జాప్యం జరగని పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో 13 మండలాలు, జిల్లా కార్యాలయంతో కలిపి 16 మంది సర్వేయర్లు ఉండాలి.

ప్రస్తుతం జిల్లాలో ఐదుగురు మాత్రమే పనిచేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా భూములు సర్వే చేయించే దిశగా లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి ఈనెల 19న ముఖ్యమంత్రి వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. డిసెంబర్ మాసంలో వీరంతా క్షేత్రస్థాయిలో అందుబాటులోకి రానున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా భూములు సర్వే చేయించినందుకు చెల్లించే ఫీజులను కూడా ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతో భూముల సర్వేలు వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.

### మరో 55 మంది సర్వేయర్లకు పరీక్ష..

రాజన్న సిరిసిల్ల జిల్లా లైసెన్స్‌డ్ సర్వేయర్లు 66 మందిని నియమించారు. వీరితో పాటు మరో 55 మంది లైసెన్సుల కోసం పరీక్షలు రాశారు. అందులో ఎంపికైన వారిలో కూడా కొంతమంది జిల్లాలో పనిచేయనున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రిజిస్ట్రేషన్లు వేగవంతం అవుతాయి. ప్రస్తుతం రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, విస్తీర్ణంలాంటి వివరాలతో మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. లైసెన్సులు సర్వేయర్లు అందుబాటులోకి వస్తే మ్యాప్‌లతో రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉంటుంది. లైసెన్స్‌డ్ సర్వేయర్లు సంబంధిత స్థలానికి సంబంధించిన మ్యాపులు తయారుచేసి పోర్టల్ లో అప్లోడ్ చేస్తారు. భవిష్యత్తులో భూమికి సంబంధించిన ఎలాంటి హద్దు వివాదాలు తలెత్తే అవకాశం ఉండదు.

### భూభారతి దరఖాస్తులకు మోక్షం

ప్రభుత్వం దరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలు కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 6787 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో భూ సమస్యలపై 6787 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, సాదా బైనామాలు, కోర్టు కేసులు, ఒకరి భూములు మరొకరిపై నమోదు కావడం, పెండింగ్ మ్యుటేషన్ తదితర సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 1393 దరఖాస్తులు, పెండింగ్ మ్యుటేషన్‌కు 295 దరఖాస్తులు, డీఎస్ పెండింగ్‌లో 404 దరఖాస్తులు వచ్చాయి. భూమి విస్తీర్ణం, చేర్పులు మార్పులు సంబంధించి 2093 దరఖాస్తులు వచ్చాయి. నిషేధిత జాబితాలో భూములు నమోదు అయినట్లు సవరించడానికి 270 దరఖాస్తులు వచ్చాయి.

అసైన్డ్ భూములు, భూసేకరణ, ఇతర రికార్డులకు సంబంధించిన సమస్యలపై 3489 దరఖాస్తులు వచ్చాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలోనూ భూముల సర్వేకి సంబంధించిన వినతి పత్రాలు వస్తున్నాయి. సర్వేయరు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తేనే వీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుతం జిల్లాలో ఐదుగురు మాత్రమే సర్వేలు ఉండడంతో దరఖాస్తులకు సకాలంలో మోక్షం కలగడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానంతో ప్రతిఘటన భూభారతి దరఖాస్తులతో పాటు ఇతర సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు.

### లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఫీజులు

లైసెన్స్ సర్వేయర్ల ద్వారా జరిపే భూముల సర్వేకి సంబంధించి ప్రభుత్వం ఫీజులను కూడా ఖరారు చేసింది. రెండు ఎకరాలలోపు

మిగతా 8లో

## విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

- విజిలెన్స్ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ కోరారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం కేంద్ర విజిలెన్స్ కమిషన్ నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞన చేయించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తమ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని, నిబద్ధతతో పనిచేసి అవినీతిఅక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ విజయ్‌శంకర్, ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌రావు, డీఆర్‌డీవో శేషాద్రి, అటవీ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్ర పథకాల లక్ష్యాలు సాధించాలి

- వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య కేంద్ర పథకాల లక్ష్యాలు సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ల(ఎంఎల్‌హెచ్‌పీ)తో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య కేంద్రపథకాల లక్ష్యాలు సాధించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీలకు దిశ నిర్దేశన చేశారు. ఈ సమావేశంలో పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ అంజలి, ప్రోగ్రాం అధికారులు అనిత, రామకృష్ణ, సంపత్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, టీబీ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం మంచి నిర్ణయమే అయినా ఎవరికి ఇబ్బంది కలగని ప్రదేశంలో నిర్మించాలని ఎస్సీ కాలనీవాసులు కోరారు. ఈమేరకుమంగళవారం పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తొలుత నిర్ణయించిన ప్రకారం కూల్చివేసిన పాతరైతుబజార్ స్థానంలోనే మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇక్కడ కాకుండా గ్రామపంచాయతీ షటర్లు ఉన్న స్థానంలో నిర్మిస్తున్నారనే సమాచారం తెలిసిందన్నారు. గ్రామపంచాయతీ షటర్ల వద్ద మరుగుదొడ్ల నిర్మాణాలు చేస్తే ఎస్సీ కాలనీ ప్రజలకు ఇబ్బంది అవుతుందన్నారు. ఇప్పటికే అనేక సంవత్సరాలుగా మురుగునీటి కాలువ సక్రమంగా లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని, అనేకమంది అనారోగ్యం పాలయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మామిడి శేఖర్, రాజెల్లయ్య, బాలరాజు, శ్రీహరి, శ్రీనివాస్, శ్వేత, దిలీప్, శ్రీవాణి, రాజయ్య, రజనీకాంత్, లక్ష్మన్, రాజేష్, రాకేష్, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దిగబడిన ధాన్యం లోడు వ్యాను

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట పరిధి కిష్టంపల్లిలో కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం లోడుతో వెళ్తున్న వ్యాను మంగళవారం దిగబడింది. ఓ వైపునకు ఒరిగిపోయింది. అప్రమత్తమైన వాహన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడం వల్ల ప్రమాదం తప్పినట్లయింది. ధాన్యం సంచులను కిందకు దింపి జేసీబీ వాహనంతో ముందుకు తీశారు.

## రోగులకు చిత్తశుద్ధితో వైద్య సేవలందించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యులు చిత్తశుద్ధితో సేవలు అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులతో కలిసి సందర్శించారు. మెటర్నిటీ, అష్టమాలజీ, ఎమర్జెన్సీ వార్డులు, రక్తపరీక్షల ల్యాబ్, ఆర్థోకి సంబంధించిన సదరం శిబిరాన్ని పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు, వైద్య పరీక్షలు, వివరాల నమోదు పరిశీలించి శిబిరానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. వైద్యులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, రోగులకు చిత్తశుద్ధితో సేవలను అందించాలన్నారు. సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీన్, డీఆర్డీవో శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా, వైద్యుడు సంతోష్‌కుమార్, డీపీఎం రవీందర్ ఉన్నారు.

## ప్రజలు భక్తిభావనతో మెలగాలి..

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి సన్మార్గం, భక్తిభావనతో మెలగాలని బ్రహ్మశ్రీ మహేశ్వరశర్మ అన్నారు. మండల కేంద్రంలోని సత్సంగ సదనం వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ మహేశ్వరశర్మ ప్రబోధనలు చేశారు. ఉరుకులు, పరుగుల జీవితంలో మానవులు ప్రశాంతతను కోల్పోతున్నారన్నారు. చెడు ఆలోచనల వల్ల వ్యసనాలను అలవాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సదనం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తీసుకోవాలి

- హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి - ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేసిన మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఖరీఫ్ సీజన్ ధాన్యం, పత్తి, మొక్కజొన్న తదితర పంటఉత్పత్తుల కొనుగోలు ఇతర అంశాలపై జిల్లాలోని రా బాయిల్డ్ రైస్‌మిల్లర్లు, జిన్నింగ్ మిల్లర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణగా కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేసిన మిల్లర్లు రైస్‌మిల్లలకు ధాన్యం ఎప్పటికప్పుడు దిగుమతిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కావాల్సిన హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. బ్యాంకు గ్యారెంటీ, అగ్రిమెంట్‌లు, రెండురోజుల్లో అందించాలన్నారు. 2024-25 ఖరీఫ్, యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను గడువులోగా అందించాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. మిల్లులోని గన్నీ సంచులను ఆయా కొనుగోలు కేంద్రాలకు వెంటనే తరలించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్‌మిల్లర్లు ముందుకు వెళ్లాలని వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని పేర్కొన్నారు. రైస్‌మిల్లర్ల ఇబ్బందులను పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

### జిన్నింగ్ మిల్లులో అన్ని వసతులు కల్పించాలి..

జిల్లాలోని ఐదు సీసీఐ కొనుగోలు కేంద్రాలైన జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి రైతులకు కనీస వసతులను కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల వద్ద మద్దతు ధర తదితర అంశాలు తెలిపేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. తూనికలు కొలతల శాఖ ఆమోదించిన కాంటాలను వినియోగించాలని, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు పొందాలని ఆదేశించారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు రెండు ఏర్పాటు చేశామని, ఆయా ప్రాంతాల రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌డీవో శేషాద్రి, డీసీఎస్‌వో చంద్ర ప్రకాష్, డీఏవో అఫ్జల్ బేగం, డీసీవో రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో మొలకెత్తుతున్న ధాన్యం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు అనేక తిప్పలు పడుతున్నారు. 15 రోజులుగా పడిగాపులు కాస్తున్నా కాంటాలు వేయడం లేదని వాపోతున్నారు. అకాల వర్షాలకు తూకం వేయకపోవడంతో కేంద్రాల్లోని ధాన్యం మొలక రావడం వల్ల అన్నదాతలు కలత చెందుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. చేతికంది వచ్చిన పంటను విక్రయించేందుకు కేంద్రాలకు తీసుకు వస్తే అకాల వర్షానికి తడిసిపోయి మొలక వస్తోందని వాపో తున్నారు. తాలును తొలగించాలని నిర్వాహకులు స్పష్టం చేయడం వల్ల శుద్ధి యంత్రాలు లేక రోజుల తరబడి ధాన్యం రాసులవద్ద నిరీక్షిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. ధాన్యం మొలకెత్తడంతో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.



రాచర్లబొప్పాపూర్‌లో మొలకెత్తిన ధాన్యం

## దత్తాత్రేయ స్వామి పూజలకు తొలగిన అడ్డంకులు

- ప్రారంభమైన బోటు సేవలు




స్వామివారి దర్శనానికి బోటులో వెళుతున్న నాయకులు

బోయినపల్లి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలంలోని వరదవెల్లి శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శనార్థం బోటు ప్రయాణ సేవలను టూరిజం శాఖ మంగళవారం ప్రారంభించింది. గత ఏడాది కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎంపీ నిధులతో బోటును సమకూర్చారు. అయితే నిబంధనల ప్రకారం టూ రిజం శాఖ నియామకం చేసిన ఆపరేటర్ మాత్రమే ఉండాలని అధికారులు పేర్కొనడంతో ఇంత కాలం స్వామివారికి నిత్య పూజలు నిలిచిపోయాయి. ఈనెల 20న దత్తాత్రేయ ఆలయం పర్యటకంపై శీతకన్ను అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటక శాఖ నుంచి వెంటనే బోట్ ఆపరేటర్ నియమించాలని టూరిజం శాఖ ఎండికి లేఖ రాశారు. దీంతో టూరిజం శాఖ ఆధ్వర్యంలో బోటు సేవలు ప్రారంభమయ్యాయి ఆలయ దర్శనానికి రానుపోను బోటు ప్రయాణానికి టూరిజం శాఖకు భక్తులు రూ, 150 చెల్లించాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, సభ్యులు, గోట్ల వెంకటేష్, ఆడెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

- ఎస్పీ మహేష్ బి. గీతే



మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బి. గీతే

8

## కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై వివాదం

- అధికారులతో గిరిజన రైతుల వాగ్వాదం



పోలీసులు, అధికారులతో వాగ్వాదానికి దిగిన గిరిజన రైతులు

8

## వృద్ధురాలి ఆత్మహత్య



వీరలక్ష్మి (ఫైల్)

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో సిరిపురం వీరలక్ష్మి (70) అనే వృద్ధురాలు మంగళవారం ఇంట్లో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వీరలక్ష్మి పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడం, నడవలేని స్థితిలో ఉండటంతో జీవితంపై విరక్తి చెందింది. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఇంట్లో తలుపులు, దర్వాజాలకు ఉపయోగించే రంగులను కడగటానికి తెచ్చిన పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు వీరశంకర్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు.

## రవాణాశాఖ అధికారుల తనిఖీలు

**- 5 వాహనాలు సీజ్, రూ. 60వేల జరిమానా**



రేణికుంట టోల్గేట్ వద్ద ఆర్టీఏ అధికారుల వాహన తనిఖీలు

తిమ్మాపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి 5 వాహనాలను సీజ్ చేసి 1 బస్సుకు జరిమానా విధించారు. ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్గేట్ వద్ద రాజీవ్ రహదారితో పాటు చొప్పదండి ప్రాంతాల్లో ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదారాబాద్ నుంచి ఛత్తీస్ఘడ్కు వెళ్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ బస్లో నిబంధనలు పాటించకపోవడంతో జరిమానా విధించారు. అంతేకాకుండా టాక్సులు, ఇన్సూరెన్స్, ఫిట్నెస్తో పాటు ఇతర ధ్రువపత్రాలు లేని రెండు ట్రాక్టర్లు, రెండు లైట్ గూడ్స్ వాహనాలు, ఒక కారు మొత్తం ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవిఐ రవికుమార్, ఏఎంవిఐ హరిత సిబ్బంది పాల్గొన్నారు.

# పెన్షనర్లు ఆన్లైన్ సేవలు ఎలా ఉపయోగించుకోవాలి?


**● ఐఎఫ్ఎమ్ఐఎస్ యాప్ వల్ల ఉపయోగాలు**

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఆన్లైన్ సేవలు ఉపయోగించుకోవాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సివి జీవన్రాజు తెలిపారు. అక్టోబర్ పెన్షన్లు యథావిధిగా జమ అవు తాయి. ఈ విషయంలో పెన్షనర్లు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఐఎఫ్ఎంఐఎస్ యాప్ గురించి ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) యాప్లో పెన్షనర్లు నమోదు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వంలో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల పేర్లు, హోదా, ఆధార్, సెల్ఫోన్ నంబర్లు ఆన్లైన్లో నమోదు చేయని వారి జీతాలు అక్టోబరు నుంచి నిలిపి వేయాల్సిందిగా ఆర్థిక శాఖ నుంచి ట్రెజరీ డైరెక్టర్కు ఆదేశాలు అందాయి. ఇది కేవలం ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది.

**● ఐఎఫ్ఎంఐఎస్ వల్ల ఉపయోగాలు**

ఇది జీతాలు, పెన్షన్లు తదితర వాటి చెల్లింపులను వేగవంతం చేస్తుంది. చెల్లింపుల్లో పారదర్శకత ఉంటుంది. ఐఎఫ్ఎమ్ఐ యాప్ ద్వారా తమకు వచ్చే పెన్షన్ పే స్లిప్పులను, సవివరంగా, సులభంగా తెలుసుకోవచ్చు. అంతేకాక దీనిలోని ప్రొఫైల్ ద్వారా మన వ్యక్తిగత కుటుంబ వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నవి తెలుసుకోవచ్చు. ఈ యాప్ పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ వంటి సేవలను అందిస్తుంది. ప్రభుత్వం ఆర్థిక నిర్వహణ ప్రక్రియ ఆటోమేట్ చేయడానికి, ఆర్థిక సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగించే కంప్యూటర్ ఆధారిత వ్యవస్థ. రాష్ట్రంలో ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు తదితరాలు అన్నీ దీని ద్వారానే నిర్వహిస్తున్నారు.




**● ఆన్లైన్లో నమోదు ఇలా**

స్మార్ట్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఐఎఫ్ఎమ్ఐఎస్ పెన్షనర్ యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలి. ఎనిమిది అంకెల పీపీవో ఐడితో లాగిన్ అవ్వాలి. సెల్ఫోన్కు నాలుగు అంకెల ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేయగానే మన పేరు వస్తుంది. దాని కింద రెండు గదులు ఉంటాయి. దానిలో నాలుగు అంకెల పాస్వర్డ్ నింపి సబ్మిట్ చేయాలి. నెల వారీగా మనం తీసుకుంటున్న పదేళ్ల వివరాలు వస్తాయి. సెల్ఫోన్ పైభాగాన ఎడమవైపు ఆకుపచ్చ రంగుల వ్యూ ప్రొఫైల్ అని ఉంటుంది. దానిలో స్పౌజ్ పేరు, పుట్టిన తేది, బ్యాంక్ అకౌంట్ నెంబర్ వివరాలు వస్తాయి. సెల్ఫోన్ పైభాగాన కుడివైపు లోగో పక్కన మూడు అడ్డగీతలు ఉంటాయి. వాటిని తాకితే తొమ్మిది రకాల ఐఎఫ్ఎమ్ఐఎస్ సేవలు వస్తాయి. అందులో ముఖ్యమైనవి, పెన్షన్ పేస్లిప్, లైఫ్ సర్టిఫికేషన్ తాకితే వీడియో రికార్డింగ్ ద్వారా మనం ప్రతీ సంవత్సరం నవంబరు నుంచి మార్చి వరకు ఇచ్చే లైఫ్ సర్టిఫికెట్ నేరుగా మన ట్రెజరీ అధికారులకు ఇవ్వవచ్చు. ఈ లైఫ్ సర్టిఫికెట్ ఆన్లైన్ ద్వారా డిజిటల్లో ఇవ్వవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే మొబైల్ నంబర్ 9849204085కు సంప్రదించాలని తెలిపారు.

## బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

- పోక్సో కేసులో నిందితుడి అరెస్టు
- కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మైనర్లతో పాటు అమ్మాయిలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థినులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేసే మహిళలు వేధింపులు, లైంగిక దాడులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్/అటెండర్గా పనిచేస్తున్న గీసుకొండ మండలం శాయంపేటకు చెందిన మహ్మద్ యాకూబ్ పాషా(30) మైనర్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో పోక్సో కేసు నమోదు చేశామని, నిందితుడిని మంగళవారం రేకుర్తిలో అరెస్టు చేసి రిమాండ్కు తరలించామని తెలిపారు. నిందితుడు బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా చైల్డ్, మహిళా వెల్ఫేర్ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సదరు పాఠశాలలో విద్యార్థినుల నుంచి సమగ్ర వివరాలు సేకరించారని తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న అభియోగాలు నిజమేనని అధికారుల కమిటీ విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి చేసినట్లు విచారణలో నిర్ధారణ అయినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని గంగాధర పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై బీఎన్ఎస్ పోక్సో ఐటీ చట్టాల్లోని కఠినమైన సెక్షన్లలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### భార్యను హింసిస్తున్న వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను హింసిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆరెపల్లి గ్రామానికి చెందిన సత్తినేని కరుణాకర్ నిత్యం మద్యం తాగుతూ కటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. రోజూ తాగి వచ్చి భార్యను కొడుతున్నాడు. గత నెల 15న కరుణాకర్ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను విపరీతంగా కొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు నిందితుడిని అరెస్టు చేశారు.

## మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ వరద గేట్లు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం పెరగడంతో ప్రస్తుత వానాకాలం సీజన్లో సోమవారం గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 22,154 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,000 క్యూసె క్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 573 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. కాగా ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 886.509 టీఎంసీ నీరు రాగా, 818.796 టీఎంసీల నీరును వదిలారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చందుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన భక్తుల టాటాఏస్ వాహనం, రుద్రంగి చెందిన కారు చందుర్తి మండలం లింగంపేట-మల్యాల గ్రామాల మధ్య వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. టాటా ఏస్ నడుపుతున్న కథలాపూర్ మండలం కలికోట గ్రామం చెందిన డ్రైవర్ రాజుకు కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయం కాగా, రుద్రంగి చెందిన లచ్చవ్వ, లక్ష్మి, దేవలక్ష్మి, రత్నమ్మలకు తలకు, కాళ్లకు గాయాలైనట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పంగా గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చందుర్తి రుద్రంగి చెందిన 108అంబులెన్స్లో పైలెట్లు నరేందర్, చాణక్య, ఈఎంటి గణేష్లు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని వేములవాడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులు

### బీఎస్సీ, హానర్స్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడదల

గణేశ్నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో 1,2,3వ సెమిస్టర్, బయో మెడికల్ సైన్స్ కోర్సులో 1,3వ సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్ శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. పరీక్షలు నవంబర్లో ఉంటాయని తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని, 300 రూపాయల అపరాధ రుసుముతో 10వ తేదీలోగా అనుమతి ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలకు వెబ్సైట్లో సంప్రదించాలని సూచించారు.

### గుడిసె దగ్ధం



దగ్ధమైన వస్తువులు

గంబీరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గంబీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో గుగులోత్ రాజునాయక్కు చెందిన గుడిసె దగ్ధమైంది. షార్ట్సర్క్యూట్తో ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రమాదంలో ఇంట్లో సామగ్రితో పాటు సరుకులు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.90వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వపరంగా బాధితుడికి సహాయం అందించాలని గ్రామస్థులు కోరారు.

### ఒకరిపై దాడి కేసు నమోదు

రామగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన గోగుల మహేందర్ అనే వ్యక్తిపై కేసు నమోదైంది. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో గల రూ. 50వేల నగదుతో పాటు టీవీ ధ్వంసం చేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# అజ్ఞాతం వీడిన చంద్రన్న

- ఆయుధాలు లేకుండానే రాష్ట్ర డీజీపీ ఎదుటకు
- 45 ఏళ్ల అజ్ఞాతానికి స్వస్తి పలికి జనజీవన స్రవంతిలోకి
- దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ప్రస్థానం
- అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ఇంటి ముఖం చూడని చంద్రన్న



పుల్లూరి ప్రసాదరావు చదువుకున్న వడుకాపూర్ ప్రభుత్వ పాఠశాల



పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి/జూలపల్లి)

ఆపరేషన్ కగార్తో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఒక్కొక్కరుగా లొంగుబాట పడుతున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన పార్టీ కీలక నేత పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ, అభయ్ 62 మంది మావోయిస్టులతో కలిసి ఆయుధాలతో లొంగిపోయారు. మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట జిల్లాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు (65) అలియాస్ చంద్రన్న అలియాస్ శంకరన్న 45 ఏళ్ల అజ్ఞాతం వీడి ఆయుధాలు పార్టీకి అప్పగించి లొంగిపోయారు. ఇది మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బేనని చెప్పవచ్చు. ప్రసాదరావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 లక్షల రూపాయల రివార్డును అందజేశారు.

**● ఆర్ఎస్యూ నుంచి అజ్ఞాతంలోకి..**

జూలపల్లి మండలం వడుకాపూర్ చెందిన పుల్లూరి ప్రసాద్రావు అలియాస్ చంద్రన్న 45 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. 1961లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుల్లూరి శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా ప్రసాదరావు జన్మించారు. ఆయనకు ఇద్దరు సోదరులు అశోక్ రావు, తిరుపతి రావు, ఒక సోదరి ఉన్నారు. ఒకరు హైదరాబాద్లో, మరొకరు రామగుండంలో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు మరణించగా గ్రామంలో సొంత ఇల్లు శిథిలావస్థకు చేరి నేలమట్టమైంది. ప్రసాదరావు వడుకాపూర్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978లో పదో తరగతి చదివారు. 1979లో పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్ ఆర్గనైజర్గా వ్యవహరించిన దగ్గు రాజలింగుతో చంద్రన్నకు పరిచయం ఏర్పడింది. రాజలింగు విప్లవ బోధనలతో ప్రభావితుడైన చంద్రన్న ఆర్ఎస్యూలో చేరి విప్లవ పంథా వైపు అడుగులు వేశారు.

**● కిషన్జీకి కొరియర్గా పని చేస్తూ..**

1980లో ఇంటర్ పూర్తి చేసిన చంద్రన్న మల్లోజుల కోటేశ్వర్ రావు అలియాస్ కిషన్జీకి కొరియర్గా పని చేస్తూ హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తున్న కేఎస్ గ్రూపు నాయకుల మధ్య సమాచారాన్ని చేరవేసే వారు. సీపీఐ పీపుల్స్ వార్ గ్రూప్ మరో నేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ మీసాల రాజిరెడ్డి దండకారణ్యంలో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, ఆయన నేతృత్వంలోని సాయధ దళంలో చేరారు. చంద్రన్నతో పాటు మరో ఇద్దరిని 1980 జూలైలో ఛత్తీస్ గఢ్లోని బీజాపూర్ జిల్లా భూపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. జగ్దల్పూర్ జైలులో ఉన్న చంద్రన్న అదే సంవత్సరం డిసెంబరులో బయటకు వచ్చి ఇంటికి చేరారు. తర్వాత కొద్ది రోజులకే అజ్ఞాతంలోకి వెళ్లి ఆసిఫాబాద్ దళంలో సభ్యుడిగా పనిచేశారు. 1981లో పీపుల్స్ వార్ ఆవిర్భావం తరువాత సిర్పూర్ దళ కమాండర్గా 1983లో బాధ్యత లు చేపట్టారు. 1987 వరకు దళ కమాండర్గా పనిచేసిన ఆయన డివిజనల్ కమిటీ సభ్యుడిగా బాధ్యతల్లో సిర్పూర్, చెన్నూరు ప్రాంత దళాల ఇన్చార్జిగా వ్యవహరించారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా వ్యవహరించిన చంద్రన్న 1995లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ కార్యదర్శిగా వ్యవహరించిన ఈ కమిటీలో చంద్రన్నతో పాటు జినుగు నర్సింహారెడ్డి అలియాస్ జంపన్న, సందె రాజమౌళి అలియాస్ ప్రసాద్లు సభ్యులుగా పనిచేశారు. 2006 వరకు కమిటీలో చంద్రన్నతోపాటు ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఇన్చార్జిగా వ్యవహరించిన చంద్రన్న 2007లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

**● 2008 నుంచి కేంద్ర కమిటీ సభ్యుడిగా..**

కేంద్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యుడిగా వ్యవహరించిన చంద్రన్న 2008లో పూర్తి స్థాయిలో సీసీ కమిటీ సభ్యుడిగా చేరారు. 2021 జూన్లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేసిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మరణించడ ంతో ఆ బాధ్యతలను చంద్రన్న చేపట్టారు. 2024 డిసెంబర్లో తెలంగాణ రాష్ట్ర కమిటీ బాధ్యతలు బడే దామోదర్ అలియాస్ చొక్కారావుకు అప్పగించిన తరువాత సీసీ మెంబర్గా చంద్రన్న తెలంగాణ కమిటీకి మార్గదర్శిగా వ్యవహరించారు. చంద్రన్న 1989లో సిర్పూర్, చెన్నూర్ డివిజనల్ కమిటీ సభ్యురాలు కుర్సంగి మోతీబాయి అలియాస్ రాధక్కను వివాహం చేసుకున్నారు. 2013 జూన్లో రాధక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరెస్టు కాగా 2015లో బెయిల్పై వచ్చిన తరువాత నిర్మల్ ప్రాంతంలోని వారి స్వగ్రామంలో నివాసం ఉంటున్నారు. అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ప్రసాదరావు ఇంటి ముఖం చూడలేదు. 17 ఏళ్లకు పైగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేసిన చంద్రన్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పిలుపు మేరకు బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. అనారోగ్య సమస్యలు కూడా వెంటాడుతుండడంతో ఆయన జనజీవన స్రవంతిలో కలిశారు.

**పార్టీలో కొనసాగుతున్నది వీరే...**

మంథని మండలం శాస్త్రులపల్లికి చెందిన మరో కేంద్ర కమిటీ సభ్యుడు మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, రామగుండం ప్రాంతానికి చెందిన డీసీఎం అప్పాసి నారాయణ అలియాస్ రమేష్, కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన రాష్ట్ర కమిటీ మెంబర్ కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేష్, పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్ గంగిడి సత్యనారాయణరెడ్డి అలియాస్ విజయ్, పాలితం గ్రామానికి చెందిన డివిజన్ కమిటీ మెంబర్ ఆలేటి రామలచ్చులు అలియాస్ రాయలచ్చులు, ఏరియా కమిటీ మెంబర్లు దాతు ఐలయ్య, వడ్కాపూర్ చెందిన ధీకొండ శంకరయ్య అలియాస్ శేషన్న, సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన జువ్వాడి వెంకటేశ్వర్ రావు అలియాస్ ధర్మన్నలు పార్టీలో కొనసాగుతున్నారు.

**మాది లొంగుబాటు కాదు..**

**- పుల్లూరి ప్రసాద రావు అలియాస్ చంద్రన్న**

'మాది లొంగుబాటు కాదు అభివృద్ధిలో కలిసి పనిచేయడానికి వచ్చాం. ఇప్పటి వరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశాను, భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తాను. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించడం ఎవరి తరం కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. 'మా భావజాలంతో భవిష్యత్తులో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నాను. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్జీని ఎన్నుకున్నారు. దేవ్జీని సపోర్ట్ చేస్తున్నాను. ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చాను.' అని ఆయన వెల్లడించారు. మావోయిస్టులు మా అన్నదమ్ములని సీఎం రేవంత్ పిలుపునివ్వడంతో ముందుకు వచ్చామని, జనంలో ఉంటూ జనం కోసం పని చేస్తామన్నారు.

### జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



వెంకటరాజం(ఫైల్)

ధర్మారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంజేరుపల్లి గ్రామానికి చెందిన సొన్నాయిల వెంకటరాజం (67) అనే వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నేళ్లుగా నాటుసారాకు అలవాటు పడడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో వెంకటరాజం మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు కూల్ డ్రింక్లో పురుగుల మందు కలిపి సోమ వారం తాగగా చికిత్స నిమిత్తం కరీంనగర్లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. వెంకటరాజం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

### సిమ్స్లో చోరీ

కళ్యాణ్నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) జనరల్ ఆసుపత్రిలో కొన్ని రోజులుగా చోరీలు జరుగుతున్నాయి. పేషెంట్లుగా ఆసుపత్రికి వచ్చి మొబైల్స్ ఎత్తుకెళుతున్న రామగుండం చెందిన వెంకటేష్ను మంగళవారం సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి కడుపునొప్పి అంటూ ఆసుపత్రిలో చేరిన వెంకటేష్ అతనికి ట్రీట్మెంట్లో కేర్ టేకర్గా ఉన్న రాజేష్కు చెందిన సెల్ఫోన్ను ఎత్తుకెళ్లాడు. అతని కదలికలు గమనించిన సెక్యూరిటీ సిబ్బంది రాజేష్ థియేటర్ కల్లు కాంపౌండ్ వద్ద మంగళవారం ఉదయం పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సెల్ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. జీఎం కాలనీకి చెందిన మదన్మోహన్ అనే వ్యక్తి రవీందర్ ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లడంతో అతడిని కూడా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాగా అతని మతిస్థిమితం సరిగా లేదని, అతను తన బైక్ అని మరో బైక్ తీసుకెళ్లినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

## రాచపల్లిలో దొంగల హల్చల్

ఇల్లందకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు పలు ఇళ్లలో హల్చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రికార్డు గది, ఆఫీస్ రూమ్లో చిందర వందర చేశారు. గ్రామంలోని సెలూన్ షాపులోని వస్తువులను కూడా పడేశారు. అదే విధంగా రెండు ఇళ్లలోని వస్తువులను కూడా చిందర వందర చేశారు. కాగా దొంగతనానికి వచ్చిన వ్యక్తి నల్ల సంచిలో డాక్యుమెంట్ పేపర్లు క్లాస్రూమ్లో మరిచి వెళ్లారు. ఎల్లమ్మ గుడిలో వస్తువులను చిందరగా పడేశారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ క్రాంతికుమార్ పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రాచపల్లిలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

## పోగొట్టుకున్న సెల్ఫోన్లు అందజేత

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు కేశవపట్నం ఏఎస్ఐ సంపత్రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్లో అప్లోడ్ చేయగా వాటిని గుర్తించి పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను బాధితులైన చెంచాల శ్రీనివాస్, బుర్ర రవి, తోట అరవింద్లకు అందజేసినట్లు తెలిపారు. కాగా ఎవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే వాటి వివరాలను వెంటనే మిస్సింగ్ మొబైల్ సీఈఐఆర్ పోర్టల్లో అప్లోడ్ చేయడం ద్వారా మొబైల్ గుర్తించవచ్చన్నారు. దీంతో తిరిగి స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేయడానికి అవకాశం ఉంటుందన్నారు.




సెల్ఫోన్లను అందజేస్తున్న ఏఎస్ఐ సంపత్రెడ్డి

## బద్ది పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో సందడిగా మారిన బద్దిపోచమ్మ ఆలయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం, నూతన వస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి ఇష్టమైన కల్లసాక పెట్టి చల్లంగా చూడాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు చర్యలు తీసుకున్నారు.

### భక్తులకు అందుబాటులో ప్రసాదాల కౌంటర్లు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల్లో భాగంగా ప్రసాదాల కేంద్రాలను భీమశ్వర ఆలయం వద్దకు తరలించారు. నెల రోజులుగా భీమన్న ఆలయం ముందు వేద పాఠశాలలో కౌంటర్ నిర్మాణాలను చేపట్టారు. రాజన్న ప్రసాద విక్రయాల కౌంటర్ పనులు పూర్తి కావడంతో రెండు కౌంటర్‌లను సోమవారం భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.


## అంజన్న క్షేత్రంలో భక్తుల పూజలు



కొండగట్టులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మల్యాల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం వేలాదిగా భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, నిత్య పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

# వేములవాడలో శరవేగంగా బ్రిడ్జి పనులు



వేములవాడ మూలవాగుపై వేగంగా జరుగుతున్న బ్రిడ్జి పనులు



14 మీటర్ల లోతుకు పిల్లర్లు వేసేందుకు యంత్రాలతో జరుగుతున్న పనులు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణం
- భక్తులకు తప్పనున్న ట్రాఫిక్ ఇబ్బందులు

వేములవాడ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ తిప్పలు తప్పేలా నిర్మిస్తున్న వంతెన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వేములవాడ మూలవాగుపై అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ. 28 కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2018 సంవత్సరం వరకు రెండు వంతెనల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి వుంది. ఎడమ వైపు మొదటి బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయినప్పటికీ కుడివైపు బ్రిడ్జి నిర్మాణ దశలోనే కూలి పోయింది. బ్రిడ్జి నిర్మాణం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండటంతో పాటు రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు, పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించడంతో వేగంగా ముందుకు సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం 190 మీటర్ల పొడవుతో మూలవాగుపై నిర్మిస్తున్నారు. బ్రిడ్జిపైన ఐదు స్లాబ్‌లు ఏర్పాటు చేయాల్సి వుంది. అయితే ఇప్పటి వరకు రెండు స్లాబ్‌లు పూర్తి అయినప్పటికీ మూడు స్లాబ్‌ల నిర్మాణం జరగాల్సి ఉంది. తిప్పాపూర్ బస్టాండు సమీపంలో మొదటి స్లాబ్, అమరవీరుల స్థూపం వద్ద చివరి స్లాబ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పిల్లర్ల కోసం యంత్రాలతో 14 మీటర్ల లోతుతో పైల్స్ చేయడంలో కాంట్రాక్టర్ నిమగ్నమై ఉన్నారు. వచ్చే వర్షాకాలం వరకు భక్తులకు, పట్టణవాసులకు బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నాడు.

### నిర్మాణ దశలోనే కూలిన బ్రిడ్జి

గతంలో మూలవాగుపై కుడివైపు నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ దశలోనే పలు మార్లు కూలిపోయింది. యేటా వర్షకాలం వస్తే చాలు బ్రిడ్జి కూలడం లేదా కుంగడం జరిగింది. రూ. 28 కోట్ల నిధులలో భూసేకరణ కోసం రూ. 7 కోట్లు సేకరించినట్లు అధికారులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ కొరవడంతో భారీ వర్షాలు పడుతున్న సమయంలో పనులు చేసినట్లు కాంట్రాక్టర్‌లు ఆర్భాటం చేశారు. ఒక బ్రిడ్జి పనులు పూర్తి అయినా అప్పటి ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదని 2018లో కాంట్రాక్టర్ నిరసన తెలిపాడు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత శాఖ మంత్రి సహకారంతో పనులు జరిగేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. భూసేకరణ చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో కాంట్రాక్టర్‌లు పనుల్లో వేగం పెంచారు.

## రూ.7వేలు పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం

జమ్మికుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7 వేలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 115 మంది రైతులు 1,140 క్వింటాళ్ల విడిపత్తి, 22 మంది రైతులు 34క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7వేలు, కనిష్ఠ ధర రూ.5,400 చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఐదు మంది రైతుల నుంచి 51క్వింటాళ్ల పత్తి మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టింది. మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు.

### ఐఐటీ మద్రాస్ నుంచి జంగపల్లి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

గన్నేరువరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐఐటి మద్రాస్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డాటా సైన్స్ ఏఐ కోర్సు పూర్తి చేసి జంగపల్లి విద్యార్థులకు ఐఐటీ నుంచి ప్రశంసా పత్రాలు అందాయి. ఎనిమిది వారాల ఆన్‌లైన్ స్కూల్ కాన్సెప్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శివసాయి, హాసిని నవలిక, భవాని, వర్షిణిలకు ఐఐటీ నుంచి ప్రశంసా పత్రాలు అందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శారద ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు ఐఐటి మద్రాస్ నుంచి సర్టిఫికెట్‌లను అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు గైడ్ చేసిన టీచర్ వసుంధర, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

### కొలనూరులో కొండచిలువ



కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని కొలనూరు గ్రామంలో కొంతసేపు కొండ చిలువ హల్‌చల్ చేసింది. కొలనూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మం గళవారం రాత్రి కొండ చిలువ రావడంతో గ్రామ స్థులు భయాందోళన గురయ్యారు. దీంతో గ్రామస్థులు కొండచిలువను హతమార్చారు.

# రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదు

- 1న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

సుభాష్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడిని నిరసిస్తూ నవంబరు 1న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 23 రోజుల క్రితం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేస్తే ఇంతవరకు అతడిపై చర్యలు తీసుకోలేదన్నారు. దేశంలో దళితులపై దాడులు జరిగితే వారికి రాజ్యాంగం, చట్టాలు సమానంగా పనిచేయడంలేదని ఆరోపించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కావడాన్ని అగ్రవర్ణాల వారు జీర్ణించుకోవడం లేదన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించినాటి నుంచి సుప్రీం కోర్టులో ఎస్సీ రిజర్వేషన్ అమలు కాలేదని, గవాయి బాధ్యతలు స్వీకరించిన తరువాత రిజర్వేషన్ అమలు చేశారని, దీనిని కూడా అగ్రవర్ణాలు జీర్ణించుకోవడం లేదని అన్నారు. బీఆర్ గవాయి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్న తరువాత మహారాష్ట్రలో అంబేద్కర్ గ్రామానికి వెళ్తే ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితోపాటు డీజీపీ స్వాగతం పలకాలని, కానీ వారు రాలేదని, ఆనాడు వారిపై చర్యలు తీసుకుంటే ఈ దాడి జరిగేది కాదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చింది కూడా గవాయి అని, వర్గీకరణను వ్యతిరేకించేవారు కూడా ఈ ఘటనను ఖండించడం లేదని అన్నారు. దాడి జరిగిన తరువాత ఢిల్లీ పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఇటీవల నిజామాబాద్‌లో రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే 24 గంటల్లో స్పందించిన మానవహక్కుల కమిషన్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే ఇంతవరకు స్పందించలేదని, సుమోటోగా కేసు స్వీకరించలేదని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, బోయిని కొమురయ్య, బక్కి మురళీకృష్ణ, చెంచాల నవీన్, కొత్తూరి రాజన్న, తడగొండ శంకర్, చిలుముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యులపై పోక్సో కేసు నమోదు చేయాలి

- లైంగిక వేధింపుల్లో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై విచారణ
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లైంగిక వేధింపులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి పోక్సో కేసు నమోదు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం ఐదు రోజులుగా విచారణ జరిపారుపుతున్నారన్నారు. లైంగిక వేధింపుల విషయంలో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై విచారణ కొనసాగుతోందన్నారు.

వారి పాత్ర ఉన్నట్లు తేలితే పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడవద్దని ఇప్పటికే అధికారులకు చెప్పామన్నారు. లైంగిక వేధింపుల బాధ్యుడితో పాటు, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేశారన్నారు. పిల్లలకు భరోసా ఇవ్వడంతో పాటు, తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా అధికారులు భరోసా కల్పిస్తున్నారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వంగర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. నిర్బంధ విద్య కోసం ఇబ్బంది పెట్టకుండా విద్యార్థుల మానసిక పరిస్థితి తెలుసుకుని అందుకు అను గుణంగా బోధించాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనూ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆత్మహత్యలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా పరిస్థితి మారలేదన్నారు. ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాలను గాలికి వదిలి వేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల తెలుగు రాష్ట్రాలకు భారీ, అతి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తరుపున అన్ని రకాల సహాయక చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశామన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని19జిల్లాల్లో వర్షం ప్రభావం భారీగా ఉన్నందున ఇప్పటికే ఆ రాష్ట్రానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పంపించామన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామన్నారు. తెలంగాణలోనూ పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశ మున్నందున ఆయా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రం తరుపున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## కొనుగోలు కేంద్రానికి స్థలం ఏర్పాటు చేయాలి



బొమ్మనపల్లిలో రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా

చిగురుమామిడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రానికి గ్రామంలో స్థలం ఏర్పాటు చేయాలని బొమ్మనపల్లిలో గ్రామ రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో హుజూరాబాద్- హుస్నాబాద్‌కు వెళ్లే వాహనాలు నిలిచిపోయి రవాణాకు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వ భూమి కేటాయించాలని యేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో గత్యంతరం లేక నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ మద్దసాని రమేష్, ఎస్సై సాయికృష్ణ గ్రామానికి వచ్చి రైతులతో మాట్లాడారు. స్థలాన్ని పరిశీలించారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందించన్నుట్లు తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, గ్రామ రైతు ఐక్య వేదిక నాయకులు, అన్ని పార్టీల గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## భూమి చదును చేస్తుండగా పురాతన నాణేలు లభ్యం

- పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పెద్దపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలం చీమలపేటలో ఇంటి స్థలాన్ని చదును చేస్తుండగా లభించిన పురాతన కాలం నాటి 10 నాణేలను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాణేలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమలపేటకు చెందిన తొంటి రాజు అతని 7 గుంటల ఇంటి స్థలాన్ని ఈ నెల 25న ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా పురాతన కాలం నాటి 10 నాణాలు బయట పడ్డాయన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే జూలపల్లి ఎస్ఐ రెవెన్యూ అధికారులతో విచారణ జరిపారని, రాజు వద్ద ఉన్న 10 నాణేలు గుర్తించి నగల తయారీ వ్యక్తి వద్ద పరీక్షించారన్నారు. అవి వెండి, రాగి, ఇత్తడి లోహాలతో తయారు చేసిన నాణాలుగా నిర్ధారించారని తెలిపారు. నిర్ధారించిన నాణాలు 111.50 గ్రాముల బరువు ఉన్నాయని, వాటిని పురావస్తు శాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పురాతన వస్తువులు, నాణేలు లభిస్తే సంబంధిత అధికారులకు అప్పజెప్పాలని, వాటిని అక్రమంగా దాచుకోవడం నేరమన్నారు. సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్ఐ సనత్ కుమార్ పాల్గొన్నారు.

## మామిడిపల్లిలో పిచ్చికుక్క దాడి.. ముగ్గురికి గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కొల్లేరు హనుమన్లు, మాసం నర్సయ్యపై కుక్క దాడి చేసింది. నిజామాబాద్ గ్రామానికి చెందిన ఓ మహిళ మామిడిపల్లికి బంధువుల ఇంటికి వస్తున్న సమయంలో ఆమెను కూడా గాయపరిచింది. మరిమడ్ల గ్రామానికి చెందిన నరసయ్య కూడా పిచ్చికుక్క దాడిలో గాయపడ్డాడు. వీరందరికీ కోనరావుపేటలో ప్రభుత్వ దవాఖానాలో మండల వైద్యాధికారి వేణుమాధవ్ చికిత్స అందించారు.

# అర్బన్ బ్యాంకు ఎన్నికలకు సహకరించండి

- ఎన్నికల అధికారి, డీసీవో మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో మనోజ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు సాఫీగా సాగేందుకు డైరెక్టర్లుగా పోటీచేస్తున్న అభ్యర్థులు, సభ్యులు, బ్యాంక్ సిబ్బంది సహకారం అందించాలని ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్.మనోజ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక అర్బన్ బ్యాంకు ప్రధానశాఖ కార్యాలయంలో పాలకవర్గ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పి.శివ నాగేందర్‌రెడ్డి, కె.వంశీకృష్ణ, ఎ.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు ఫిర్యాదు

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన నూనె పద్మ అనే మహిళ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి గ్రామ పంచాయతీ కార్యదర్శికి డబ్బులు ఇచ్చినట్లు ఆరోపిస్తూ ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా విచారణ జరిపి నిజనిర్ధారణ జరిగాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా తాను ఎవరి వద్ద నుంచి డబ్బులు తీసుకోలేదని తెలిపారు.

## రొట్టమాకురేవు కవిత్వ అవార్డులకు కవుల ఎంపిక

త్వరలో అవార్డుల ప్రదాన సభ




రొట్టమాకురేవు కవిత్వ అవార్డుల బ్రోచర్

కారేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పన్నెండు సంవత్సరాలుగా తన తండ్రి షేక్ మహమ్మద్ మియా స్మృత్యర్థం కవులను కవిత్వ అవార్డులకు ఎంపిక చేస్తున్నామని, ఈ ఏడాది కూడా కవుల ఎంపిక జరిగిందని, త్వరలోనే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్టు ప్రముఖ కవి షేక్ యాకుబ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 నుంచి 2024వరకు వెలువడిన కవితాసంపుటుల నుంచి నాలుగు కవితాసంపుటులను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిందన్నారు.

వాటిలో సిరిసిల్లకు చెందిన నాగిళ్ల రమేష్ రచించిన వల్లకొడిసె వన్నెకాడు, హైదరబాద్‌కు చెందిన జూపాక సభద్ర రచించిన తెలంగాణి కైతల దొంతులు, మహబూబాబాద్‌కు చెందిన రహిమొద్దీన్ రచించిన కలలరంగు, ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన నీటి గింజలు కవితా సంపుటిలను ఎంపికయ్యాయయన్నారు. వారికి తన తండ్రి షేక్ మహమ్మద్ మియా, తన గురుసమానులైన మాజీ ఎమ్మెల్యే కేవీఎల్ నరసింహారావు, తన మామ పురిటిపాటి రామిరెడ్డి పేరిట ఈ అవార్డులను అందజేయనున్నామని, త్వరలోనే ఈ కార్యక్రమం వివరాలు వెల్లడిస్తామని యాకూబ్ తన ప్రకటనలో తెలిపారు.

## భూముల సర్వే వేగవంతం

(5వ పేజీ తరువాయి)

భూమి విస్తీర్ణాన్ని సర్వే చేసి మ్యాప్ రూపొందించడానికి రైతుల నుంచి రూ.వెయ్యి వసూలు చేస్తారు. 2నుంచి 5 ఎకరాల వరకు రూ రెండు వేలు, 5నుంచి 10 ఏకరాల వరకు రూ.5వేలు, 10 ఎకరాల విస్తీర్ణం మించితే రూ 5వేలకు అదనంగా ప్రతి ఎకరానికి వీరు రూ 500చొప్పున ఫీజు వసూలు చేస్తారు. ఇందులో ప్రభుత్వం ఐదు శాతం మినహాయించుకుని మిగిలిన 95 శాతం సర్వేయర్లకు చెల్లిస్తోంది. ప్రస్తుతం నాలుగు సర్వే నంబర్లలోపు భూమి విస్తీర్ణాన్ని సర్వే చేయడానికి ఆన్‌లైన్ ద్వారా రూ.275ఫీజును వసూలు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి కాకపోవడంతోనే పారదర్శకంగా ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వం ప్రతిమండలానికి ఆరుగురు వరకు లైసెన్స్‌డ్ సర్వేయర్లను కేటాయించనున్నది. భూసర్వే కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ లేదా వెబ్‌సైట్‌ను రూపొందిస్తోంది. భూ యజమాని యాప్, వెబ్‌సైట్ ద్వారా చలానా చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి. దరఖాస్తు లైసెన్స్‌డ్ సర్వేయర్‌కు వెళ్లగా సర్వే చేసి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచుతారు. లైసెన్స్‌డ్ సర్వేయర్‌కు మూడు దఫాలుగా సర్వేకు సంబంధించిన డబ్బులను బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

# గ్రామాల్లో అందని పశువైద్యం

**- ఏళ్లు గడుస్తున్నా సొంత భవనం కరువు - ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగింపు - ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు**

వేములవాడ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మండలం రుద్రవరంలోని గ్రామీణ పశు వైద్యశాల సబ్‌సెంటర్ భవనం లేకపోవడంతో పశువుల కాపర్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుద్రవరం పశువైద్యశాల పరిధిలో ఆరెపల్లి, సంకెపల్లి, అయ్యోరుపల్లి, అనుపురం, కొడుముంజ, నాంపల్లి, చంద్రగిరి గ్రామాలకు అందుబాటులో ఉండేది. 8 గ్రామాల్లో వేల సంఖ్యలో జీవాలు ఉన్నాయి. ప్రస్తుతం రుద్రవరం గ్రామంలో స్వంత పశువైద్యశాల భవనం లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఒక్క చిన్న గదికి పరిమితమైంది.



రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రూమ్‌లో కొనసాగుతున్న పశువైద్యశాల

**● స్థలం ఉన్నా..**

రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సుమారు 4 గుంటలు భూమిని పశువైద్యశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. పశువైద్య భవన నిర్మాణానికి గతంలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో టెండర్ సైతం నిర్వహించారు. అయితే సదరు టెండర్ నిర్వాహకుడు భవన నిర్మాణం చేసేందుకు నిరాకరించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. టెండర్‌ను రద్దు చేసి రీటెండర్ ద్వారా భవన నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..**

**- అభిలాష్, పశువైద్యాధికారి, వేములవాడ**

వేములవాడ మండలం రుద్రవరంలో గ్రామీణ పశు వైద్యశాల సబ్‌సెంటర్ అద్దె రూమ్‌లో కొనసాగుతోంది. పాడి రైతులు, పశువులకాపర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాము. వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించి నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. భవనం నిర్మాణం కోసం గతంలోనే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము.

**పట్టించుకోవడం లేదు..**

**- పచ్చిమడ్ల శ్రీనివాస్, రుద్రవరం గ్రామస్థుడు**



రుద్రవరం పాత గ్రామంలో గ్రామ పంచాయతీ పక్కన పశు వైద్యశాల భవనం ఉండేది. చుట్టు పక్కల పాడి రైతులు రుద్రవరం పశువులను తీసుకుని వచ్చి వైద్యం చేయించుకుని వెళ్లేవారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు వచ్చి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

## పాఠశాలలో కోతుల బెడద



పాఠశాల ఆవరణలో కోతుల గుంపు



విద్యార్థుల మధ్య కోతి

చందుర్తి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోతుల బెడద తీవ్రంగా ఉన్నది. తరగతి గదిలోకి కోతులు వస్తున్నాయని, దీంతో తాము భయాందోళనకు గురువుతున్నామని విద్యార్థులు పేర్కొంటున్నారు. తెచ్చుకుంటున్న తినుబండారాలను సైతం ఎత్తుకెళ్తున్నాయని విద్యార్థులు పేర్కొన్నారు. చాలా రోజులుగా కోతులు ఇబ్బందులకు గురిచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. పాఠశాల సమీపంలో ఉన్న కోతులను దూర ప్రాంతాలకు తరలించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**కోతుల నివారణకు చర్యలు చేపట్టాలి**

ఎన్నం శ్రీధర్, మాజీ వార్డు సభ్యుడు, మల్యాల

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోతులతో పాటు కుక్కల బెడదతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విద్యార్థులపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. పాఠశాలలో కోతుల, కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి. విద్యార్థులకు రక్షణ కల్పించాలి.

# కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై వివాదం

**- అధికారులతో గిరిజన రైతుల వాగ్వాదం - పోలీసు బందోబస్తు మధ్య కేంద్రం ప్రారంభం**

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం మద్దిమల్లతండా గ్రామపంచాయతీ పరిధిలోని లొద్దితండాలో ధాన్యం కొనుగోలు కేంద్రం స్థల వివాదం మంగళవారం మళ్లీ ముదిరింది. తమ తండాలో ధాన్యం పోయనీయబోమని లొద్దితండాకు చెందిన గిరిజన రైతులు తేల్చిచెప్పారు. కేంద్రం ప్రారంభించేందుకు చేరుకున్న అధికారులను అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. గతంలో మాదిరిగానే లొద్దితండాలో కేంద్రం స్థలంలోనే కాశీగుట్టతండా, ఎర్రగడ్డ తండా రైతులు ధాన్యం పోయాలని అధికారులు స్పష్టం చేశారు. తమ తండాకు ధాన్యం తీసుకురానీమంటూ అధికారులు, పోలీసులతో వాదించారు. అటవీ భూములను చదును చేస్తే చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వో శ్రీహరిప్రసాద్ హెచ్చరించారు. చదును చేసిన అటవీ భూముల్లో కందకాలు తీయాలని సిబ్బందిని ఆదేశించారు. తండాల్లోని రైతులు కలిసికట్టుగా ఉండి ఒకరికి ఒకరూ సహకరించుకోవాలని సూచించారు. పోలీసుల బందోబస్తు నడుమ లొద్దితండాలో కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ రాములునాయక్, తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఎస్ఐ లక్ష్మణ్, ఐకేపీ ఏపీఎం సుదర్శన్, ఎఫ్ఎస్‌వోలు రంజిత్‌కుమార్, పద్మలత, సకారం, ఆర్ఐ శివకుమార్, సీసీ రమణ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

## ఆత్మగౌరవ ప్రదర్శనను విజయవంతం చేయాలి

కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దళితుల ఆత్మగౌరవ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి సీజేఐ బీఆర్ గవాయిపై జరిగిన ఘటనను నిరసిస్తూ హైదరాబాదులో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో నవంబర్ 1న నిర్వహించే దళితుల ఆత్మగౌరవ నిరసనను దళితులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బుర్ర శంకర్, కన్నం రాజు, కన్నం దేవయ్య ఉన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : భారత ప్రధాన న్యాయమూర్తిపై యత్నించిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నవంబరు 1న హైదరాబాద్‌లో తలపెట్టిన దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను విజయవంతం చేయాలని నాయకుడు లక్ష్మణ్ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దళితులపై ఇటీవల దాడులు చోటుచేసుకోవడం దారుణమన్నారు. దళితుల ఐక్యతను చాటేందుకు ప్రదర్శనను చేపట్టామని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు భగవంతం, అక్షణ్, రాజయ్య, రవి, గంగరాజు, మోజెస్, దేవయ్య, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ఉన్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలకు నివాళిగా రక్తదాన శిబిరం నిలుస్తుందన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కళ్యాణలక్ష్మి గార్డెన్‌లో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలను కాపాడడంలో రక్తదానం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదన్నారు. వారి జ్ఞాపకార్థమే ప్రతి ఏటా పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షించడమే కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ ముందు వరుసలో ఉంటారన్నారు. మనం చేసే రక్తదానం వలన అత్యవసర సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 460మంది స్వచ్ఛందంగా యువత, ప్రజలు ఆటో డ్రైవర్‌లు, పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు తరలివచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, మధుకర్, నటేశ్, ఆర్ఐలు మధుకర్, రమేశ్, యాదగిరి, డాక్టర్ సంధ్యారాణి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గుడ్ల రవి, పెండ్యాల కేశవరెడ్డి, బుస్స ఆంజనేయులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో మొదట దర్గాను తొలగించాలి

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి - ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి**



ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న దర్గాను తొలగించిన తర్వాతనే కోటి లింగాలను ముట్టుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను బీజేపీ నాయకులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గోపి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా ఆలయంలో ఉన్న కోటి లింగాలను అక్కడినుంచి మార్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆలయ ప్రాంగణంలో ఇతర మతస్తుల నిర్మాణాలు కూడా ఉన్నాయని వాటి తొలగించకుండా కోటి లింగాలను తొలగించాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనివలన హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని ముందుగా దేవస్థానం అధికారులు ఆలయ ప్రాంగణంలో ఉన్న దర్గాను తొలగించిన తర్వాతనే ఇతర కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం, సంతోష్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, జిల్లా మీడియా కన్వీనర్ కానుగంటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : రాజన్న ఆలయంలో కోటి లింగాలను తరలిస్తే, దర్గాను కూడా తరలించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత ప్రతాప రామకృష్ణ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని భీమేశ్వరగార్డెన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, విస్తరణలో భాగంగా ఇప్పటికి ఆలయాన్ని మూసివేస్తారా.. ఎన్నిరోజుల్లో అభివృద్ధి చేస్తారనే అంశాన్ని దేవాదాయ శాఖ స్పష్టం చేయలేదన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో సైతం అధికారులు, విప్ దృష్టికి కోటి లింగాల విషయాన్ని తీసుకువెళ్లామన్నారు. దర్గాను తరలించకుండా కోటి లింగాలను తీస్తే వేములవాడ బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేగుల మల్లికార్జున్, రాపెల్లి శ్రీధర్, అక్కపల్లి వివేక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

రుద్రంగి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల రైతులు, ప్రజలు మొంతా తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పుష్పలత సూచించారు. రెండు రోజులపాటు తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు ఉన్నందున రైతులు జాగ్రత్త పాటించాలన్నారు. వాతావరణ కేంద్ర సూచనల మేరకు ఈనెల 29 తేదీన భారీ వర్షాల నేపథ్యంలో వరి కోయని రైతులు కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. వరి కోతలు కోసిన వారు కొనుగోలు కేంద్రాలలో వరికుప్పలు తడవకుండా, రంగు మారకుండా కుప్పలపైన, కింద టార్పాలిన్ కవర్లు కప్పలన్నారు. చుట్టూ నీరు నిలవకుండా కందకాలుగాని, దాన్యపు తాళ్ళు(ఉనుక) కుప్పల చుట్టూ ఉంచుకోవాలని, పల్లపు ప్రాంతాలలో గల ధాన్యపు కుప్పలను ఎత్తు ప్రాంతాలకు తరలించుకోవాలి అన్నారు. తుఫాను ప్రభావం ముగిసే వరకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## ర్యాలీని విజయవంతం చేయాలి

రుద్రంగి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయిపై దాడికి నిరసనగా హైదరాబాదులో నవంబరు 1న చేపట్టే ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీ మండల శాఖల ఆధ్వర్యంలో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నవంబరు 1న సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడికి నిరసనగా హైదరాబాద్‌లో భారీ నిరసన కార్యక్రమ ర్యాలీలో రుద్రంగి నుంచి కులాలకతీతంగా మేధావులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పీఎస్ కార్యదర్శి కట్కూరి దాసు, మల్యాల లింగయ్య, నేదురి సునీల్, అల్లూరి లచ్చిరెడ్డి, దయ్యాల పెద్దలు, నెవురి నాగేష్, బోయిని చంద్రయ్య, తర్రే సుదర్శన్, గడ్డం మహేందర్, ఆర్మూర్ నర్సయ్య, కోలా మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని పల్లెల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సర్కారు అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన టార్పాలిన్లను కప్పి కాపాడాలని సూచించారు. కొనుగోళ్లను వేగవంతం చేసేలా నిర్వాహకులు చూడాలని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## పెద్దలింగాపూర్‌లో పశువైద్య శిబిరం

ఇల్లంతకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో పశువైద్య శిబిరం జరిగింది. పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ చర్యలలో భాగంగా మంగళవారం వైద్యశిబిరం కొనసాగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి పూర్ణచంద్రిక, ఇందిరలతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వరికోతలు తాత్కాలికంగా నిలిపివేయాలి



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌తో వర్షాలు కురుస్తున్నందున రైతులందరు కోతలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని ముష్టిపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ కొనుగోలు కేంద్రాంలో ఉన్న ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది... ఎంత కొనుగోలు చేశారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలోని పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్‌లు, నీటి వసతులతో పాటు విద్యుత్ కనెక్షన్‌లను కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా చెత్తచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సరైన తేమ శాతం 17కు వచ్చిన తర్వాతనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఇంకా వరి కోతలు మొదలు పెట్టని రైతులు తుఫాన్ వర్షాలు తగ్గేవరకు వాయిదా వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

## పగిలిన మిషన్ భగీరథ పైపు..

వేములవాడ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పైపు పగిలి పక్షం రోజులు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో గల ద్వారకనగర్ రోడ్ నంబర్-1 ప్రధాన రోడ్డును ఆనుకుని మిషన్ భగీరథ పైపు పగిలిపోయింది. ఇప్పటికే మూడు మార్లు పైపు పగలడంతో నామమాత్రంగా అధికారులు మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో తరుచు పైపు పగలడంతో వాటర్ వృథాగా రోడ్డుపై పోవడమే కాకుండా స్థానిక కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## యువజన విభాగం జిల్లా అధ్యక్షుడుగా నరేష్



నరేష్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న పర్శరాములు

వేములవాడ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం యవజన విభాగం జిల్లా అధ్యక్షుడుగా గుండెకార్ల నరేష్‌ను నియమించినట్లు బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు తెలిపారు. వేములవాడ మండలం అగ్రహారం గ్రామంలో బీసీ సంఘ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన నరేష్‌ను యువజన విభాగం అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధానకార్యదర్శి రెడ్డవేని పర్శరాములు, తీగల శ్రీనివాస్, నగారం కొమురవ్వ, మారవేని మహేష్ ఉన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక ఎన్నారై బొమ్మకంటి సతీష్-జ్యోతి, వ్యాపారి వెంకటేశం- భూలక్ష్మీ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని మంగళవారం నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. సతీష్, వెంకటేశం తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నగదును అందించామని పేర్కొన్నారు. నిర్మాణ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## విత్తనోత్పత్తిపై రైతులు దృష్టి సారించాలి

చందుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులే తమ వ్యవసాయ క్షేత్రాల్లో విత్తనోత్పత్తి చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ పేర్కొన్నారు. చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో ముకుందం అనే రైతుకు చెందిన పొలంలో క్షేత్ర దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. ప్రభుత్వం అందించిన డబ్ల్యూజీఎల్ 915 విత్తన పనితీరును వివరించారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతి రెవిన్యూ గ్రామానికి ముగ్గురు రైతులను ఎంపిక చేసి నాణ్యమైన విత్తనాలను ప్రతి గ్రామానికి సరఫరా చేయడం అనే కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. అందులో భాగంగా పంట పొలాన్ని దిగుబడితో పాటు నాణ్యత పరిమాణాలను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు, శాస్త్రవేత్తలు డాక్టర్ కే మదన్మోహన్‌రెడ్డి, ఎం రాజేంద్రప్రసాద్, డాక్టర్ రజినీకాంత్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి శిరీష, రైతులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా దేవయ్య

ఇల్లంతకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా చింతకుంట దేవయ్య ఎన్నికయ్యాడు. మండలకేంద్రంలో మంగళవారం సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా చింతకుంట వెంకటేశం, గౌరవ అధ్యక్షుడిగా కళ్యాణం నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా చింతకుంట జనార్దన్, కోశాధికారిగా చింతకుంట శ్రీనివాస్, సభ్యులుగా రమేష్, శ్రీకాంత్, కార్తీక్, శివకుమార్, మహేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గసభ్యులను ఘనంగా సత్కరించారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**- మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య**



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎల్లయ్య

కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలంలోని గోవిందరావుపేట తండా, బావుసాయిపేట, మామిడిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, డీపీవో శ్రీనివాస్, ఏపీఎం సరస్వతి, ప్రజాప్రతినిధులు నందు గౌడ్, కచ్చకాయల బాల్‌రెడ్డి, నర్సయ్య, కర్రోళ్ల భాస్కర్, నాయిని ప్రభాకర్‌రెడ్డి, పద్మావతి, ప్రకాష్ నాయక్, భూక్య తిరుపతి, శ్రీనివాస్, మల్లేశం, రామ్‌రెడ్డి, అమృతరావు, నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

**- రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి**

చందుర్తి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. చందుర్తి మండలంలో లింగంపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం పవన్‌కుమార్ నాయకులు గణేష్, రాములు, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి రజిత

కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కొలనూరు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రజిత మంగళ వారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి వైద్య బృందం సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.